కథానిక

# కష్టాలకడలిలో కనకం

ముక్కామల కృష్ణారావు

చలిగాలి వీస్తూంది. నల్లని మబ్బులు ఆకాశాన్ని ఆవరించుకున్నయ్. కనకం మెదడులో ఆలోచనలు ఒకదాని తరువాత ఒకటివచ్చి మేఘాల్లా మాయమవుతున్నయ్. పల్చని మబ్బుల్లో సూర్యుని లేత కిరణాల కాంతి సన్నగా ప్రసరితమవుతూంది. కాని విచారానికి, నిరుత్సాహానికి అలవాటుబడని తనలోని మార్పు ఆమె గ్రహించినా వేరే ఆలోచనలకు అవకాశం ఇచ్చేదికాదు. ఐనా ఏవో ఆలోచనలు ఆమెను కలవరపెడ్తూనే ఉన్నాయి. ఆమె ఉత్సాహాంను అంతరింపజేస్తూనేఉన్నాయి, కాని ముందుముందు ఆమె వాటినిఅంతగా పట్టించుకోవాలన్నంత నమ్మకానికి రాలేకపోయింది.

రాత్రి పదిగంటలయింది. కనకంలో మాత్రం చలనం కలగలేదు. లీల పడుకుని నిద్రపోతూంది. కూతుర్ని చూస్తూంటే కనకంలో మెసలుతున్న భావాలు ఒకదానితో నొకటి సంఘర్షణ పడుతున్నట్లు అనిపించింది. ఆమెలో ఆ వేదన రెట్టింపు అయింది.

మేఘాలు ఒకదానితో ఒకటి ఢీకొన్నాయి. మెరపులతోకూడ వచ్చిన పిడుగు శబ్దం కనకం హృదయంలో సుత్తిదెబ్బలా తగిలింది. ఆమె భయముతో వణికిపోయింది. కూతుర్ని కౌగలించుకుందామన్న ఆరాటం ఆమెలో హెచ్చయింది. ఎక్కువకాలం కూర్చోలేకపోయింది. ఆమె కళ్లు తిరిగిపోతున్నయ్. శరీరం తూలిపోతూంది. కూతురిని కౌగలించుకుని పడుకున్నది. కాని కంటిమీద రెప్ప పడలేదు.

పన్నెండు సంవత్సరాలు నిండకుండానే తల్లిదండ్రులను కోల్పోయింది కనకం. మేనమామ తప్ప ఆమెకు "నా" అన్నవారెవరూ లేకపోయారు. తలితండ్రులను పోగొట్టుకొన్న ఆమెకు మేనమామ సర్వస్వం అయినాడు. అతనికి వివాహం అవడం సంవత్సరం తిరక్కుండానే భార్య పోవడమువల్ల ఇంటలో అన్నిపనిపాట్లకు బాధ్యురాలయింది కనకం.

రోజులు, వారాలు, నెలలు సంవత్సరాలు ఒకదాని తరువాత ఒకటి పరుగులు తీస్తున్నాయి. వీటితో సమంగా కనకం జీవితంలోకూడ మార్పులు సహజంగా జరిగాయి. ఇంట్లో సర్వ స్వతంత్రురాలయింది ఆమె. ఆమె మాటను కాదన్నవారెవరూలేరు. సినిమాలకు, క్లబ్బులకు, షికార్లకు ఆనందంతో అంగీకరించేవాడు మేనమామ. డబ్బుకి లోపంలేని మేనమామ ఇంట్లో కనకంకి స్వర్గం లభించింది. నౌకర్లతో ఇలు నిండిపోయింది. ఆమె జీవితం ఆనందమయం. ప్రతీ నిమషం ఆనందానికై, నూతన అభిరుచులకై తహతహపడేది ఆమె మనసు. కాని అప్పుడప్పుడు మేనమామ మాటలు కనకం హృదయంలో తుఫాను చెలరేగదీసేవి. అతని మాటలో దాంచివున్న భావం ఆమె మనసును కోసివేసేది. తుదకు మేనమామ నోటంట వెలువడిన మాటలు ఆమెను ఆశ్చర్యంతోపాటు భయంతో వణికించాయి. "నిన్ను పెళ్ళి చేసుకుందామన్న ఆశతోనే ఇన్నాళ్లు నీ ఆనందానికి, స్వేచ్ఛకి అడ్డురాలేదు నేను. నీమనసు ఎప్పటికైనా మారుతుందేమో అన్న ఆశతోనే ఇప్పటిదాకా వేచిఉన్నాను. కాని నీ నడత తప్పుత్రోవలో పడింది. నే నిచ్చిన స్వేచ్ఛను నువ్వు వేరేవిధంగా భావిస్తున్నావు. రోజులు గడచినకొద్దీ నీ నడత అడ్డుదారిలో పడుతూంది. నీ ఆశయమును, నీ విధిని మరచిపోయావు. అయినా మించిపోలేదు. ఇప్పటికయినా నా మాటను అవతలకు నెట్టివేయకు. నీ సౌఖ్యమే నా సౌఖ్యం. నన్ను తిరస్కరించవన్న ఆశతోనే నిన్ను బ్రతిమాలుకుంటున్నాను..." మేనమామ మాటలకి ఆమె కళ్ళల్లో నిప్పురవ్వలు చెలరేగాయి. ఆవేశంతో ఇల్లు విడచిపెట్టింది కనకం.

కనకం అదృష్టం ఆమెకు అన్నివిధాలా తోడుపడింది. ఆమె అభిరుచులకు అనుకూలంగా కాలేజీ స్నేహితుడు, గొప్పఇంటి యువ్వనుడు ఆమెకు లభించాడు. అతనితోకలసి స్వర్గసౌఖ్యం

అనుభవించ గలుగుతూంది. ఐనా అప్పుడప్పుడు ఆమె మనసు ఎందుకో ఏదో పోగొట్టుకున్నట్లు బాధపడేది. తన ఆనందానికీ, స్వేచ్ఛకీ ఏదో అంతరాయం కలిగిస్తూందన్న భ్రమ ఆమెను తరుముతూనేఉంది. ఇంతకుముందు అనుభవించిన ఆనందానికి, వివాహం ఐనతరువాత పొందుతున్న సౌఖ్యానికి ఎంతైనా తేడా కనుపిస్తూంది ఆమెకు. ఆమె మనసు ముందు పొందిన ఆనందానికై తహతహ పడసాగింది. స్నేహితులతో క్లబ్బులకు, సినిమాలకు వెళ్లడం పరిపాటైన ఆమెకు భర్తతో ఎటు వెళ్లినా ఏదో కొరతగానే ఉండేది. వివాహం అయిన దగ్గర్నుంచి తను పూర్తిగా ఆనందానికి వంచింపబడుతూందని వాపోయేది. రానురాను భర్తకు చెప్పకుండానే, భర్తకై వనచ్చి స్నేహితులతో పికార్లకనీ, సినిమాకనీ వెళ్ళడం పరిపాటైంది ఆమెకు. ఐనా ఆమెస్వేచ్ఛకు అడ్డుతగల లేదు భర్త. కనకంలో చలనం ఎక్కువైంది. తను యిదివరకులాగే సర్వస్వతంత్రురాలు. భర్తకూడ తన సరదాలకు అడ్డుచెప్పక పోటంతో ఆమెలో పూర్తిగా స్వతంత్రభావం చెలరేగింది. ఎటు వెళ్ళినా, ఏంచేసినా, ఏవరితో వెళ్ళినా భర్తకు చెప్పనక్కరలేదన్న భావం ఆమెలో దృఢంగా నాటుకుపోయింది. తనగురించి భర్త ఏవిధంగా భావిస్తున్నాడో, లోకం తనమీద ఎన్ని నిందల భారం మోపుతున్నదో తెలుసుకుందుకు అవకాశమే లేకపోయింది ఆమెకు. తనకు కనిపిస్తున్న ప్రతీ వస్తువులో ఆనందం చిందులాడ్తుందన్న అపోహ ఆమెను పూర్తిగా ఆవరించుకుంది.

ఆనాడు భర్తనోటంట వెలువడిన పలుకులకు కనకం జవాబుగా చిరునవ్వు నవ్వింది. "చూడు కనకం! నామాటలు నీలో చిరునవ్వును తప్పమరే ప్రభావం కలిగించలేవని నాకు తెలుసు. ఇప్పుడు నువ్వు ఉన్నటువంటి పరిస్థితులలో నీకు ఆనందం తప్ప మరేమీ రుచించదనీ నాకు తెలుసు. కాని నువ్వే ఆలోచించు. లోకం నీ గురించి ఏమంటూందో? నా గురించి ఏమంటూందో? మన వాళ్ళందరూ పంక్తిలో భోజనాలకు కూడా మనల్ని పిలవడం మానివేసారు. బంధువులు అన్న వారందర్నీ ఏహ్యభావంతో తిరస్కరించావు. వారిని హీనంగా చూసావు. నీ స్నేహితులే నీ సర్వస్వం అని అపోహ పడ్తున్నావు. మనకు ధనం ఉంది. గొప్పవారితో పరిచయం ఉంది. అంతకు కేగా లోకాన్ని నువ్వు లక్ష్యపెట్టడం లేదు? కాని ఈరెండూపోయాక మనం ఎక్కడ నిలబడగలం? నాగురించి నేను చెప్పడంలేదు. ఏనాటినుంచి అవుతేనువ్వు నన్నూ, నాభర్తృత్వాన్నీ గుర్తించడం మానివేసావో ఆనాటినుంచే నా మనసును రాయిగా మార్చుకున్నాను. నీ సుఖాన్నే నా మనసు అహర్నిశలు కాంక్షిస్తూంది. నేను యీ లోకంనుంచి పోయిన తరువాత నీ జీవితం ఎట్లా మారుతుందో అన్న ఆలోచన నన్ను క్షీణింపజేస్తూంది..." భర్తలోని పవిత్రభావాలు కనకానికి వెంటనే అర్థం అవలేదు.

రోజులు నెలలు పరుగులు తీస్తూనే ఉన్నాయి.

కనకం ఆడబిడ్డకు తల్లి అయింది. ఆమెహృదయము ఆనందంతో చిందులాడింది. బిడ్డతో పాటు కనకంలో కూడా మార్పురావడం ఆమె భర్తకు ఆశ్చర్యంగా తోచింది. సంసారం, ఇల్లు, నౌకర్లు ఎన్నడూ అక్కరకురానివన్నీ ఆమె పరిశోధించడం అతనికి ముందు లేనటువంటి సంతుష్టిని, భార్యమీద తిరిగి విశ్వాసాన్ని కలిగించింది. కనకంలో మార్పులు ఆమె స్నేహితులకు ఎటువంటి బాధను కలిగించలేదు. ఆమెకై తహతహ పడ్డ స్నేహితులు ఆమె అస్తిత్వమునే మరచిపోయారంటే అసంగతంకాదు. కనకంలో భర్త పలుకులు ఉండుండి చలనాన్ని కలిగిస్తూనే ఉన్నాయి. తనబిడ్డ భవిష్యత్తు తనమీద ఆధారపడి ఉందని తెలుసుకున్నది. ఇన్నాళ్ళూ తనకు తాను ద్రోహంచేసుకున్నట్లు మనసారా ప్రేమిస్తున్న భర్తకు ద్రోహంచేసినట్లు తెలుసుకోగలిగింది. సమాజంలో తనుకూడా గౌరవంగా మెలగాలన్న ఉత్సుక ఆమెలో కలిగింది. కూతురు వివాహానికై ప్రయత్నించాలన్న సంసారభారం ఆమెమీద పడిందని భావించుకున్నది. కాని ఆమె ఆశలు అడుగంటాయి. ఆమె ఉత్సాహం అంతరించింది. మనసిచ్చి మాట్లాడేవారే కరువయ్యారు. క్లబ్బుల్లో వందలకొద్ది కొన్ని లక్షలకు అధికార్లు అనిపించుకుంటున్న పెద్దమనుష్యులు తన చిరునవ్వుకై తహతహబడ్డం, మామూలు మనుష్యులు ఈ పూటకు వుంటే మరో పూటకు తడుముకొనే ఫకీరులు కూడా తనతో మాట్లాడేందుకు అస

హ్యాంచుకోటం ఆమెలో ఆశ్చర్యాన్ని కలిగించింది, అయినా తనకు ధనలోపంలేదు. ప్రేమించే భర్త ఉన్నాడు. కూతురు ఉంది. లోకంతో తనకేంపని అన్న భావం ఆమెలో మెలగినా తనకు తెలియకుండానే తన హృదయం ఊహించని కలయికకై తహతహపట్టం ఆమెకు అగమ్యగోచరమయేది. తనను చూచి నిరసన భావంతో, వెటకారంతో, తోటి యువతుల విషపునవ్వులతో ఆమె హృదయంలో అగ్నిమంటలు చెలరేగేవి. అర్థంకానటువంటి ఆవేదన ఆమెను అలమటింపజేస్తూనేవుంది.

లీల పదహారేళ్ల పడుచయింది. లీల వయసులో తను అనుభవించిన ఆనందం స్మృతికిరాగానే కనకం శరీరం పులకితమయేది. కాని ఏ ఆనందదానికై ఆమె ఆ కాలంలో తహతహ పడేదో ఆ ఆనందఛాయలే ఆమె హృదయాన్ని కొన్ని సంవత్సరాల తరువాత కోసిపారేస్తున్నాయి. భర్త పోయాడు. ధనం తరిగిపోయింది. కూతురు వివాహానికై సిద్ధమయింది. లీలకు పెళ్ళిచేయాలి. కాని ఎవరితో? పెళ్ళికొడుకు ఎవరు? బంధువులు అన్నవారు ఏనాడో తనకులేనివారయారు. ఎవరి దగ్గరకు వెళ్లి కూతురుకై వివాహప్రస్తావన తెస్తుంది. కనకంలో నిరుత్సాహం పూర్తిగా ఆవరించుకుంది.

వర్షం పడింది. వెలిసింది. ఆకాశంలో నక్షత్రాలు మిణుకుమిణుకుమంటున్నాయి. కూతుర్ని గట్టిగా కౌగలించుకుని వెక్కి వెక్కి ఏడుస్తూంది కనకం. కలవరపాటుతో లీల లేచి తల్లిని అదిమి పట్టుకుంది. తల్లి కన్నీటిధారలు ఆమె మనసును ఆవేదనతో నింపివేసాయి. లీల కళ్లంట నీటిబిందువులు జలజల రాలాయి. "ఎందుకే నీకింత విచారం అమ్మా? నాకు తెలుసు నువ్వెందుకు దుఃఖిస్తున్నావో? కాని ఇట్లా మనసులో దిగులుతో ఎన్నాళ్లనికుళ్లిపోతావు? నాగురించేగా నీవిచారం? నా వివాహసమస్యకదూ నీవిచారానికి కారణం? కాని మనం చేసేదేముంది? కష్టపడి చదువుచెప్పించావు. సంబంధానికై పడరానిపాట్లు పడుతున్నావు. అయినా లాభంలేకపోయింది. దీనికి విచారం దేనికి? మనకష్టాలు గట్టెక్కాయి. నా కష్టానికి ఫలితంగా నాకు స్కూల్లో మాష్టరు పని అయింది. రేపట్నుంచే వెళ్లాలి" అంటున్న కూతురు పలుకులు ఆమె హృదయంలో ఆవరించుకున్న నల్లని మబ్బులను మాయంచేసాయి.

కథానిక

# ప్రయాణంతెచ్చిన రభస

ఇంటూరి పుల్లారావు

ఇది నిజం అనటములో అతిశయోక్తి యెంత మాత్రంలేదు. ఈ నిజాన్ని మోసంతో కప్పిపుచ్చారు. ఆ పెద్దమనిషితరహా, వేషం ముందు నా నిజాయితీ జయంపొందలేకపోయింది. ఈ ప్రజ వేషాలకు మోసపోతుంది. నా నిజాన్ని నమ్మిన బుద్ధిమంతులు లేకపోలేదు! ఉన్నారు. లేకేం! ఈ నవనాగరిక ప్రపంచములో ఈల్లాంటి వ్యక్తులు లేకపోతే నాబోటివాళ్లకు స్థానం యెక్కడ? నాడాలబూట్లతో నాకాళ్లు పచ్చడి పచ్చడిగా తొక్కి అదేమంటే తప్పంతా నాదేనంటు నాపై ప్రళయకాలరుద్రుని రూపం దాల్చుతాడా? నా ప్రక్కనకూర్చున్న ఛోటామోటా మనిషి సర్దుబాటు చేయకపోతే యెంత రసభ జరిగివుండేదో? పెట్టెలోనుంచి దిగివెళ్ళేవరకు నావంక కోడెత్రాచు మాదిరిగా చూశాడు.

నా చూపు టీస్టాల్ మీదకు ప్రసరించింది. జేబులో చిల్లరడబ్బులు ఘల్లుమంటూ విసుగ్గా వాటి భాషలో యేమిటో గొణిగాయి. "ఈ స్థానంలో నుంచి మార్పులేదా?" అంటున్నాయేమో.

"ఈ సంచీ సీటూ చూస్తుండండి" అన్నాను ఎదురుగా భీముడులా కూర్చున్న వయస్సు తిరిగిన ఒక వ్యక్తితో.

"సరే" అన్నట్లు అంగీకార సూచకంగా తల త్రిప్పాడు. టీస్టాల్ కేసి నడిచాను. రెండణాలు నాకు సెలవుచెప్పి అయ్యరు గళ్లాలోకి యెగిరి గంతేశాయి.

'రెండణాలకు గ్లాసు సగానికా టీ?' అన్నాను. రైలు పోతుందనే తొందరతో ప్రయాణీకులు